VC NEWS

# వేగుచుక్క

పీడిత ప్రజల గొంతుక...

TELUGU DAILY NEWS

www.veguchukkanews.com

నిజామాబాద్ ఫిబ్రవరి 03 సోమవారం 2025

వెల: రూ.3/- పేజీలు : 4 సంపుటి:02 సంచిక: 195

PUBLISHED FROM HYDERABAD CIRCULATED BY RANGAREDDY, NALGONDA, KHAMMAM, KARIMNAGAR, WARANGAL, MAHABOOBNAGAR, MEDAK, NIZAMABAD, ADILABAD



2లో

కోడ్ పేరిట పథకాలను ఆపే కుట్ర



# బీసీ జనాభా 46.25 %

రాష్ట్రంలో బీసీ జనాభా 46.25 శాతంగా లెక్క తేలింది. ఎస్సీలు 17.43%, ఎస్టీలు 10.45, ఓసీలు 15.79 శాతం మంది ఉన్నారు. రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన సామాజిక, ఆర్థిక, విద్య, ఉపాధి, రాజకీయ, కుల సర్వేలో ఈ విషయాలు వెల్లడయ్యాయి.

- ఎస్సీలు 17.43బీ ఎస్టీలు: 10.45.. ఓసీలు 15.79 శాతం..
- ఉపసంఘానికి చేరిన సమగ్ర కుటుంబ సర్వే నివేదిక
- తెలంగాణ సామాజిక ఆర్థిక సర్వే చరిత్రాత్మకం
- సమగ్ర సామాజిక న్యాయానికి ఇది పునాది
- బీసీ సబ్‌కమిటీ ఛైర్మన్, మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి

హైదరాబాద్: రాష్ట్రంలో బీసీ జనాభా 46.25 శాతంగా లెక్క తేలింది. ఎస్సీలు 17.43%, ఎస్టీలు 10.45, ఓసీలు 15.79 శాతం మంది ఉన్నారు. రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన సామాజిక, ఆర్థిక, విద్య, ఉపాధి, రాజకీయ, కుల సర్వేలో ఈ విషయాలు వెల్లడయ్యాయి. ఈ అంశంపై మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి ఛైర్మన్‌గా ఉన్న బీసీ ఉపసంఘానికి ప్రణాళికశాఖ ముఖ్యకార్యదర్శి సందీప్‌కుమార్ సుల్తానియా, నోడల్ అధికారి అనుదీప్ దురిశెట్టి సర్వే నివేదికను ఆదివారం అందజేశారు. ఈ సందర్భంగా సచివాలయంలో ఉప సంఘం వైస్ ఛైర్మన్ దామోదర్ రాజనర్సింహ, సభ్యులు పొన్నం ప్రభాకర్, సీతక్కలతో కలిసి మంత్రి ఉత్తమ్ విలేకరులతో మాట్లాడారు. రాష్ట్రంలో సమగ్ర సామాజిక న్యాయం చేసేందుకు చారిత్రక అడుగు పడిందని ఉత్తమ్ ప్రకటించారు. సామాజిక, ఆర్థిక, కులగణన కోసం సమగ్ర కుటుంబ సర్వే చేయాలని నిర్ణయించిన ఏడాదిలోగా పూర్తి నివేదికను సిద్ధం చేశామని తెలిపారు. నివేదికపై ఈ నెల 4న మంత్రి మండలి ఆమోదం తీసుకుని, అదే రోజు శాసనసభలో చర్చిస్తామని వెల్లడించారు. రాష్ట్రంలోని అన్నివర్గాల ప్రజలు, పేదలకు న్యాయం జరుగుతుందని తెలిపారు. ఈ సర్వే నివేదిక, డేటా ఆధారంగా పేదలకు సంక్షేమ పథకాలు, రాజకీయాలు, విద్య తదితర రంగాల్లో అవకాశాలు కల్పిస్తామని, సంక్షేమ కార్యక్రమాల్ని సమర్థంగా పునర్నిర్మాణం చేస్తామని వెల్లడించారు. స్వల్ప సమయంలో.. తక్కువ ఖర్చుతో పూర్తి"స్వాతంత్ర్యం వచ్చినప్పటి నుంచి పదేళ్లకోసారి జనగణన చేసినప్పటికీ అందులో కులగణనను చేర్చలేదు. మొన్నటి ఎన్నికల సమయంలో కాంగ్రెస్ పార్టీ అగ్రనేత రాహుల్‌గాంధీ ప్రజలకు ఇచ్చిన హామీని మా ప్రభుత్వం అమల్లోకి తీసుకువచ్చింది. ఆయన సూచనలు పరిగణనలోకి తీసుకుంటూ చారిత్రక నిర్ణయంతో కులగణన చేసింది. సీఎం రేవంత్‌రెడ్డి, డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క రోజువారీ దీనిపై సమీక్ష చేస్తూ ఎప్పటికప్పుడు అవసరమైన సూచనలు చేశారు. ఈ నివేదికలో వెల్లడైన డేటా ఆధారంగా సంక్షేమ పథకాలకు పునాదులు వేసినట్లయింది. కులసర్వే కోసం గత ఏడాది ఫిబ్రవరి 4న నిర్ణయం

తీసుకుని, 16న శాసనసభ తీర్మానం చేసింది. సరిగ్గా ఏడాదిలోపు నివేదికను తీసుకువచ్చాం. ఈ సర్వేలో 1,03,889 మంది గణకులు పాల్గొన్నారు. కేవలం 50 రోజుల వ్యవధిలో నివేదిక వచ్చింది. సర్వేలో 96.9 శాతం మంది (3.54 కోట్ల మంది) పాల్గొన్నారు. సర్వేకు అందుబాటులో లేకపోవడంతో 3.1 శాతం (16 లక్షల మంది) దూరంగా ఉన్నారు.

## భక్తులతో కళకళలాడిన బాసర క్షేత్రం



వసంత పంచమి సందర్భంగా సోమవారం చదువుల తల్లి సరస్వతి కొలువైన బాసర క్షేత్రం భక్తులతో కళకళలాడింది. తెలుగు రాష్ట్రాలతో పాటు మహారాష్ట్ర, తమిళనాడు నుంచి భక్తులు తరలివచ్చారు.

ఆదిలాబాద్: వసంత పంచమి సందర్భంగా సోమవారం చదువుల తల్లి సరస్వతి కొలువైన బాసర క్షేత్రం భక్తులతో కళకళలాడింది. తెలుగు రాష్ట్రాలతో పాటు మహారాష్ట్ర, తమిళనాడు నుంచి భక్తులు తరలివచ్చారు. తెల్లవారుజామున నాలుగు గంటలకే ప్రారంభమైన అక్షరాభ్యాసాలు రాత్రి పది దాటినా కొనసాగుతూనే ఉన్నాయి. అక్షరాభ్యాసాలతో నిమిత్తం లేకుండా దాదాపు లక్ష మంది భక్తులు వచ్చి ఉంటారని దేవాదాయశాఖ అంచనా వేసింది. రైల్వేస్టేషన్‌కు సమీపంలోనే వాహనాలను నిలిపివేయడంతో ఆలయానికి వెళ్లడానికి భక్తులు, ప్రధానంగా వృద్ధులు, పిల్లలు తీవ్ర ఇబ్బందులకు గురి కావాల్సి వచ్చింది. దేవాదాయశాఖ మంత్రి అమ్మవారికి

పట్టువస్త్రాలు సమర్పించడం ఆనవాయితీ. ఎమ్మెల్సీ ఎన్నికల కోడ్ కారణంగా ఈసారి ఆగిపోయినట్లు బాసర ఇన్‌ఛార్జి ఈవో సుధాకర్‌రెడ్డి తెలిపారు. నిర్మల్ జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్, ఎస్పీ జానకి షర్మిల అధికారులతో సమావేశం నిర్వహించారు. భక్తులకు ఇబ్బందులు తలెత్తకుండా పర్యవేక్షించాలని ఆదేశించారు.



2లో

## కేంద్రానిది సవతి తల్లి ప్రేమ!

- బడ్జెట్‌లో తెలంగాణకు ఇచ్చింది గుండు సున్నా
- కేంద్ర మంత్రులు కిషన్‌రెడ్డి, సంజయ్‌లు రాజీనామా చేయాలి
- కేసీఆర్, కేటీఆర్, హరీశ్‌రావులు పోరాటానికి మాతో కలిసి రావాలి
- కాంగ్రెస్ ధర్నాలో పీసీసీ అధ్యక్షుడు మహేశ్‌కుమార్‌గౌడ్ పిలుపు

"తెలంగాణ చిన్న రాష్ట్రమైనా దేశ జీడీపీకి 5.1% సమకూరుస్తోంది. అందులో కనీసం 2.1 శాతమైనా తిరిగి రావడం లేదు.

## కుంభమేళాకు 20 రోజుల్లోనే 33కోట్ల మంది.. వసంత పంచమి వేళ మరింత రద్దీ!



ప్రయాగ్‌రాజ్:,మహాకుంభమేళా నేపథ్యంలో వసంత పంచమి నాడు త్రివేణి సంగమంలో పుణ్యస్నానాలు ఆచరించేందుకు భక్తులు పోటెత్తుతున్నారు. మౌని అమావాస్య రోజున చోటుచేసుకున్న తొక్కిసలాటతో అప్రమత్తమైన యూపీ సర్కార్.. ఎటువంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా పకడ్బందీ ఏర్పాట్లు చేస్తోంది. ఎటువంటి తప్పిదం లేకుండా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించి ప్రభుత్వం.. సీనియర్ ఐఏఎస్‌లను రంగంలోకి దింపింది.జనవరి 13న కుంభమేళా ప్రారంభం కాగా.. ఫిబ్రవరి 1వ తేదీ వరకు ప్రయాగ్‌రాజ్‌లో సుమారు 33కోట్ల మంది పుణ్యస్నానాలు ఆచరించినట్లు యూపీ ప్రభుత్వం అంచనా వేసింది. శనివారం 2.15కోట్ల మంది రాగా.. ఆదివారం మధ్యాహ్నం 12గంటల వరకే 90లక్షల మంది భక్తులు స్నానాలు ఆచరించినట్లు తెలిపింది. వసంత పంచమి పురస్కరించుకొని సోమవారం 4 నుంచి 6కోట్ల మంది రానున్నట్లు అధికారులు అంచనా వేస్తున్నారు. మరోవైపు కుంభమేళాకు ప్రముఖుల తాకిడి కూడా పెరుగుతోంది. వివిధ రంగాలకు చెందిన ప్రముఖులు ఇప్పటికే ప్రయాగ్‌రాజ్‌కు వచ్చివెళ్లగా.. ఫిబ్రవరి 5న ప్రధాని మోదీ రాక కోసం ఏర్పాట్లు చేస్తున్నారు.అమెరికా జనాభాతో సమానంగా యాత్రికులుమౌని అమావాస్య రోజున కోట్లాది మంది ప్రయాగ్‌రాజ్ రావడం, సెక్టార్ 2లో జరిగిన తొక్కిసలాటలో 30 మంది చనిపోయిన నేపథ్యంలో క్రౌడ్ మేనేజిమెంట్‌పై అధికారులు మరింత దృష్టి సారించారు. 2019లో అర్ధ కుంభమేళా

సమయంలో పనిచేసిన ఐఏఎస్ అధికారులు అశీష్ గోయల్, భానుచంద్ర గోస్వామిలను రంగంలోకి దించారు. వీరిద్దరు మేళా అధికారి విజయ్ కిరణ్ ఆనంద్‌తో కలిసి పని చేయనున్నారు.అదనపు డీజీపీ భాను భాస్కర్ కూడా రద్దీ నియంత్రణ చర్యలను పర్యవేక్షిస్తున్నారు.



# ఫైనల్లోనూ ఆల్‌రౌండ్ మెరుపులు

- టోర్నీలో ఆడిన ఏడు మ్యాచ్‌ల్లోనూ భారత్ నెగ్గింది.
- రూ.5 కోట్ల నజరానా
- పీఎం, సీఎంల అభినందన
- 'ప్లేయర్ ఆఫ్ ద టోర్నీ' అవార్డుతో త్రిష

- మహిళల అండర్-19 ప్రపంచకప్ మళ్లీ భారత్‌దే
- గొంగడి త్రిష అద్భుత ప్రదర్శన
- టోర్నీ ఆద్యంతం సూపర్ ఫామ్

మనమ్మాయ్ కప్పు తెచ్చింది గత ఏడాది రోహిత్‌సేన టీ20 ప్రపంచకప్ విజయంతో మురిసిపోయారు భారత అభిమానులు. ఇంకో ఆరు నెలలు తిరిగేసరికి భారత్ ఖాతాలో మరో ప్రపంచకప్ చేరింది. భవిష్యత్ మహిళల క్రికెట్‌ను ఏలేది తామే అని చాటుతూ.

గత ఏడాది రోహిత్‌సేన టీ20 ప్రపంచకప్ విజయంతో మురిసిపోయారు భారత అభిమానులు. ఇంకో ఆరు నెలలు తిరిగేసరికి భారత్ ఖాతాలో మరో ప్రపంచకప్ చేరింది. భవిష్యత్ మహిళల క్రికెట్‌ను ఏలేది తామే అని చాటుతూ.. వరుసగా రెండో పర్యాయం కూడా అండర్-19 ప్రపంచకప్‌ను సొంతం చేసుకున్నారు భారత అమ్మాయిలు. అపజయమే లేకుండా, భారీ విజయాలతో ఫైనల్‌కు దూసుకొచ్చిన యువ భారత్.. టైటిల్ పోరులో మరింతగా రెచ్చిపోయింది. టోర్నీ ఆరంభం నుంచి

మిగతా 2లో

వేగుచుక్క

# ఫైనల్లోనూ ఆల్‌రౌండ్ మెరుపులు




ఇటు బ్యాటుతో, అటు బంతితో చెలరేగిపోతున్న తెలుగమ్మాయి గొంగడి త్రిష.. ఫైనల్లో ఇంకా గొప్ప ప్రదర్శన చేసింది. బౌలింగ్‌లో 3 వికెట్లతో, బ్యాటింగ్‌లో 44 పరుగులతో రెచ్చిపోయిన త్రిషకు.. దక్షిణాఫ్రికా నుంచి సమాధానమే లేకపోయింది. మిగతా భారత జట్టు కూడా అదరగొట్టినా.. త్రిష ప్రదర్శన టోర్నీ చరిత్రలో నిలిచిపోయేదనడంలో సందేహం లేదు.

టోర్నీలో ఆడిన ఏడు మ్యాచ్‌ల్లోనూ భారత్ నెగ్గింది.

భారత స్పిన్నర్ వైష్ణవి శర్మ టోర్నీలో పడగొట్టిన వికెట్లు. ఒక అండర్-19 టీ20 ప్రపంచకప్‌లో అత్యధిక వికెట్లు ఆమెవే. 2023లో మ్యాగీ క్లార్క్ (ఆస్ట్రేలియా) 12 వికెట్ల రికార్డు బద్దలైంది.

రూ.5 కోట్ల నజరానా

మహిళల అండర్-19 టీ20 ప్రపంచకప్‌ను గెలుచుకున్న భారత జట్టుకు బీసీసీఐ భారీ నజరానా ప్రకటించింది. జట్టు సభ్యులతో పాటు సహాయ సిబ్బందికి కలిపి రూ.5 కోట్లు అందజేయనున్నట్లు వెల్లడించింది.

పీఎం, సీఎంల అభినందన

వరుసగా రెండోసారి అండర్-19 మహిళల ప్రపంచకప్‌ను గెలుచుకున్న భారత జట్టును ప్రధాని నరేంద్ర మోదీ.. ఆంధ్రప్రదేశ్, తెలంగాణ ముఖ్యమంత్రులు నారా చంద్రబాబు నాయుడు, ఎ.రేవంత్ రెడ్డి అభినందించారు. టోర్నీ అంతటా నిలకడగా రాణిస్తూ.. ఫైనల్లో అద్భుత ప్రదర్శన చేసిన భద్రాచలం అమ్మాయి గొంగడి త్రిషకు చంద్రబాబు, రేవంత్ ప్రత్యేకంగా అభినందనలు తెలిపారు.

కౌలాలంపూర్‘ప్లేయర్ ఆఫ్ ద టోర్నీ’ అవార్డుతో త్రిషమహిళల అండర్-19 ప్రపంచకప్‌ను భారత్ వేరే జట్టుకు పోనివ్వలేదు. రెండేళ్ల కిందట తొలి ట్రోఫీని దక్కించుకున్న టీమ్ఇండియా.. రెండో పర్యాయం కూడా కప్పును నిలబెట్టుకుంది. అప్రతిహత విజయాలతో ఫైనల్‌కు దూసుకొచ్చిన భారత్.. తుది సమరంలోనూ జూలు విదిల్చింది. దక్షిణాఫ్రికాను 9 వికెట్ల తేడాతో చిత్తు చేసింది. టోర్నీలో ఎంతో నిలకడగా రాణించిన తెలుగమ్మాయి త్రిష.. ఫైనల్లోనూ అద్భుత ప్రదర్శన చేసింది. మొదట త్రిష (3/15)తో పాటు ఆయూషి (2/9) వైష్ణవి (2/23), పరుణిక (2/6) కూడా విజృంభించడంతో దక్షిణాఫ్రికా 20 ఓవర్లలో 82 పరుగులకే కుప్పకూలింది. లక్ష్యాన్ని భారత్ 11.2 ఓవర్లలో ఒక్క వికెట్ మాత్రమే కోల్పోయి అలవోకగా ఛేదించింది. ఓపెనర్ త్రిష (44 నాటౌట్‌బీ 33 బంతుల్లో 8ఐ4) మరోసారి సూపర్ ఇన్నింగ్స్ ఆడింది. అమెకే ‘ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్’ అవార్డు లభించింది. 309 పరుగులతో టోర్నీ టాప్‌స్కోరర్‌గా నిలవడమే కాక.. 7 వికెట్లు కూడా తీసిన త్రిషనే ‘ప్లేయర్ ఆఫ్ ద టోర్నీ’ అవార్డు కూడా వరించింది. భారత్ అజేయంగా కప్పు గెలవడం విశేషం. ఆడిన ఏడు మ్యాచ్‌ల్లోనూ నెగ్గింది.ఆడుతూ పాడుతూ..: మొదట అద్భుత బౌలింగ్‌తోనే భారత్ విజయం దాదాపు ఖాయం అయిపోయింది. అయితే స్వల్ప లక్ష్యమే అయినా.. దక్షిణాఫ్రికా బౌలింగ్ మెరుగ్గా ఉండడంతో ఛేదనలో భారత్ కొంచెం కష్టపడుతుందేమో అనుకుంటే, సూపర్ ఫామ్‌లో ఉన్న త్రిష ఆ అవకాశమే లేకుండా చేసింది. తొలి రెండు ఓవర్లలోనే మూడు ఫోర్లు కొట్టిన ఆమె.. సఫారీ బౌలర్ల లయను దెబ్బ తీసింది. శేష్నీ నాయుడు వేసిన నాలుగో ఓవర్లో త్రిష మూడుసార్లు బంతిని బౌండరీకి పంపింది. దీంతో 4 ఓవర్లకు 36/0తో నిలిచింది. తర్వాతి ఓవర్లో మరో ఓపెనర్ కమలిని (8)ని దక్షిణాఫ్రికా కెప్టెన్ కైలా ఔట్ చేసినా.. భారత్‌కు ఇబ్బంది లేకపోయింది. సనిక చాల్కే (26 నాటౌట్‌బీ 22 బంతుల్లో 4ఐ4) నుంచి చక్కటి సహకారం అందడంతో జట్టును లక్ష్యం దిశగా నడిపించింది త్రిష. 12వ ఓవర్ రెండో బంతికి సనిక ఫోర్ కొట్టడంతో ప్రపంచకప్ భారత్ సొంతమైంది. ఈ జోడీ అభేద్యమైన రెండో వికెట్‌కు 48 పరుగులు జోడించింది.సఫారీ జట్టు విలవిల: టాస్ గెలిచి మొదట బ్యాటింగ్ చేసిన సఫారీ జట్టు పరుగుల కోసం ఆపసోపాలు పడింది. స్పిన్ ఆడడానికి తడబడే సఫారీల బలహీనతను ఆ జట్టు అమ్మాయిలు కూడా బయట పెట్టుకున్నారు. పేసర్లు జోషిత, షబ్నం చెరో రెండు ఓవర్లు మాత్రమే వేయగా.. మిగతా 16 ఓవర్లను స్పిన్నర్లు త్రిష, పరుణిక, ఆయూషి, వైష్ణవి పంచుకున్నారు. ఈ నలుగురు పోటీ పడి వికెట్లు తీశారు. వీరిని ఎదుర్కోవడం సఫారీ అమ్మాయిలకు శక్తిని మించిన పనే అయింది. రెండో ఓవర్లోనే భారత్‌కు తొలి వికెట్‌ను అందించింది స్పిన్నర్ పరుణిక. ఆమె సిమోన్ లోరెన్స్‌ను డకౌట్ చేసింది. అనంతరం ఫామ్‌లో ఉన్న జెమ్మా బోథా (16)ను విశాఖపట్నం అమ్మాయి షబ్నం (1/7) ఔట్ చేసింది. తర్వాత అంతా స్పిన్నర్ల మాయాజాలమే. ఆయూషి తొలి రెండు ఓవర్లు మెయిడెన్లు వేసి రెండు వికెట్లు పడగొట్టడం విశేషం. ఆ తర్వాత త్రిష మాయాజాలం సాగింది. ఆమె కెప్టెన్ కైలా (7)తో పాటు మరో రెండు కీలక వికెట్లు తీసి సఫారీ జట్టును కోలుకోలేని దెబ్బ తీసింది. పవాన్ వూస్ట్ (23), ఫే కౌలింగ్ (15) మినహా బ్యాటర్లెవ్వరూ ఎక్కువసేపు నిలవలేకపోయారు. పరుగులూ రాక, వికెట్లు నిలవక.. సఫారీ జట్టు ఉక్కిరిబిక్కిరైంది. సరిగ్గా ఇన్నింగ్స్ చివరి బంతికి ఆ జట్టు ఆలౌటైంది.దక్షిణాఫ్రికా ఇన్నింగ్స్: జెమ్మా (సి) కమలిని (బి) షబ్నం 16బీ లోరెన్స్ (బి) పరుణిక 0బీ డయారా (బి) ఆయూషి 3బీ కైలా (సి) పరుణిక (బి) త్రిష 7బీ కరాబో (బి) ఆయూషి 10బీ మీక్ వాన్ (స్టంప్డ్) కమలిని (బి) త్రిష 23బీ కౌలింగ్ (బి) వైష్ణవి 15బీ శేష్నీ నాయుడు (బి) త్రిష 0బీ ఆష్లీ వాన్‌విక్ (సి) వైష్ణవి (బి) పరుణిక 0బీ మోనాలిసా (బి) వైష్ణవి 0బీ నిని నాటౌట్ 2బీ ఎక్స్‌ట్రాలు 6 మొత్తం: (20 ఓవర్లలో ఆలౌట్) 82బీ వికెట్ల పతనం: 1-11, 2-20, 3-20, 4-40, 5-44, 6-74, 7-74, 8-80, 9-80బీ బౌలింగ్: జోషిత 2-0-17-0బీ పరుణిక సిసోడియా 4-0-6-2బీ షబ్నం షకిల్ 2-0-7-1బీ ఆయూషి శర్మ 4-2-9-2బీ వైష్ణవి శర్మ 4-0-23-2బీ గొంగడి త్రిష 4-0-15-3

భారత్ ఇన్నింగ్స్: కమలిని (సి) లోరెన్స్ (బి) కైలా 8బీ త్రిష నాటౌట్ 44బీ సనిక నాటౌట్ 26బీ ఎక్స్‌ట్రాలు 6 మొత్తం: (11.2 ఓవర్లలో వికెట్ నష్టానికి) 84బీ వికెట్ల పతనం: 1-36బీ బౌలింగ్: నిని 1-0-7-0బీ ఫే కౌలింగ్ 2-0-19-0బీ కైలా 4-1-14-1బీ శేష్నీ నాయుడు 1-0-12-0బీ ఆష్లీ వాన్‌విక్ 1-0-12-0బీ మోనాలిసా 1.2-0-10-0బీ జెమ్మా బోథా 1-0-9-


0వీళ్లు కూడా..ఈ ప్రపంచకప్ విజయంలో త్రిషతో పాటు కమలిని, సనిక చాల్కె, వైష్ణవి శర్మ, ఆయూషి శుక్లా, పరుణిక సిసోడియా కూడా కీలక పాత్ర పోషించారు. తమిళనాడు బ్యాటర్ కమలిని 7 ఇన్నింగ్స్‌ల్లో 143 పరుగులు చేసింది. స్కాట్లాండ్, ఇంగ్లాండ్‌పై అర్ధశతకాలు అందుకుంది. డబ్ల్యూపీఎల్ వేలంలో ముంబయి ఇండియన్స్ రూ.1.6 కోట్లకు ఆమెను దక్కించుకుంది. సనిక 6 ఇన్నింగ్స్‌ల్లో 95 పరుగులు చేసింది. బౌలింగ్‌లో భారత స్పిన్ ద్వయం వైష్ణవి (17 వికెట్లు), ఆయూషి శుక్లా

(14) ఈ టోర్నీలో అత్యధిక వికెట్లు తీసిన బౌలర్లలో వరుసగా తొలి రెండు స్థానాల్లో నిలిచారు. ఓ అండర్-19 టీ20 ప్రపంచకప్‌లో అత్యధిక వికెట్లు తీసిన బౌలర్‌గా వైష్ణవి చరిత్ర సృష్టించింది. మలేసియాపై హ్యాట్రిక్ సహా అయిదు వికెట్లు పడగొట్టింది.

మరో స్పిన్నర్ పరుణిక సిసోడియా (10) కూడా సత్తాచాటింది. సెమీస్‌లో 3/21, ఫైనల్లో 2/6 ప్రదర్శనతో మెరిసింది. ఇక 17 ఏళ్ల విశాఖ పేసర్ షబ్నమ్ షకీల్ (4) కూడా ఆకట్టుకుంది. శ్రీలంకతో మ్యాచ్‌లో రెండు వికెట్లతో రాణించింది. ఆమెకు కూడా ఇది వరుసగా రెండో అండర్-19 ప్రపంచకప్

మరో తెలుగమ్మాయి ద్రితి కేసరి జట్టులో ఉన్నప్పటికీ మ్యాచ్‌లో ఆడే అవకాశం రాలేదు. వరుసగా రెండో సారి భారత్ అండర్-19 ప్రపంచకప్‌ను దక్కించుకోవడంతో కలుగుతున్న ఆనందం కంటే కూడా దీన్ని సాధించే దిశగా మన అమ్మాయిల ప్రయాణం మరింత కిక్కునిస్తోంది. పసికూనలు, పెద్ద జట్లు అనే తేడా లేకుండా ఎదురొచ్చిన ప్రత్యర్థినల్లా చిత్తుచేసి, అజేయంగా కప్‌ను ముద్దాడటం సాధారణ విషయం కాదు.

# ఒక్కరోజే 20 శాతం పెరిగిన స్టాక్..



దేశీయ స్టాక్ మార్కెట్ సూచీలు గురువారం సెషన్లో తీవ్ర ఒడుదొడుకుల్లో ట్రేడవుతున్నాయి. లాభాల్లోనే ఉన్నప్పటికీ.. ఒక్కసారిగా పెరిగి మళ్లీ వెంటనే పడిపోతున్నాయి. సెన్సెక్స్ ప్రస్తుతం ఉదయం 11.30 గంటల సమయంలో. 250 పాయింట్లు, నిఫ్టీ 100 పాయింట్ల లాభంలో కొనసాగుతున్నాయి. ఇదే సమయంలో కొన్ని స్టాక్స్ భారీగా దూసుకెళ్తున్నాయి. ఒక స్టాక్ %ు%3 ఫలితాల నేపథ్యంలో 20 శాతం అప్పర్ సర్క్యూట్ కొట్టింది.

హితాచి ఎనర్జీ ఇండియా లిమిటెడ్ స్టాక్ అదరగొడుతోంది. ఇన్వెస్టర్లకు కాసుల పంట పండిస్తోంది. 5 శాతం, 10 శాతం కాదు.. ఒక్కరోజే ఏకంగా 20 శాతం దూసుకెళ్లింది. అప్పర్ సర్క్యూట్లో లాకైంది. మళ్లీ మామూలుగా పెరగలేదు. 20 శాతం అంటే ఒక్కో షేరుపై %చీూజు% లో ఏకంగా రూ. 2046.25 పెరగడం విశేషం. కిందటి సెషన్లో రూ. 10,231.25 వద్ద ముగిసిన స్టాక్.. ఇవాళ ఆరంభంలోనే 10 శాతానికిపైగా లాభంతో రూ. 11,444 వద్ద ఓపెన్ అయింది. అక్కడితో ఆగకుండా మళ్లీ దూసుకెళ్లింది. ఈ క్రమంలోనే కిందటి సెషన్ క్లోజింగ్ నుంచి 20 శాతం పెరిగి చివరకు రూ. 12,277.50 వద్ద అప్పర్ సర్క్యూట్లో లాకైంది. కిందటి రోజు కూడా ఈ స్టాక్ పెరిగింది. 2 రోజుల వ్యవధిలోనే స్టాక్ ధర ఏకంగా 27 శాతానికిపైగా ఎగబాకింది. దీంతో ఇందులో పెట్టుబడులు పెట్టిన వారికి కాసుల వర్షం కురిసింది. భారీగా లాభాలు ఆర్జించారు.

2024-25 ఆర్థిక సంవత్సరం అక్టోబర్- డిసెంబర్ త్రైమాసికానికి సంబంధించి ఈ కంపెనీ ఫలితాల్ని బుధవారం రోజు ప్రకటించింది. ఇక్కడ ఇది దలాల్ స్ట్రీట్ అంచనాల్ని అధిగమించి పెర్ఫామెన్స్ చేయడం విశేషం. అంతకుముందు ఆర్థిక సంవత్సరం ఇదే సమయంతో పోలిస్తే కంపెనీ నికర లాభం క్యూ3లో 498 శాతం మేర పెరిగి రూ. 137.4 కోట్లుగా నమోదైంది. ఇదే సమయంలో కిందటి త్రైమాసికంతో (జులై- సెప్టెంబర్) పోలిస్తే 162.7 శాతం పెరిగింది. క్యూ2లో కంపెనీ లాభం రూ. 52.3 కోట్లుగా ఉంది. ఇక ఇదే సమయంలో కంపెనీ ఆదాయం 31 శాతం మేర పెరిగి రూ. 1672.4 కోట్లకు చేరుకుంది. మూడో త్రైమాసికంలో ఎబిటా రూ. 168.9 కోట్లుగా ఉంది. రికార్డు స్థాయిలో తొలిసారి ఒక త్రైమాసికంలో అత్యధిక విలువతో ఆర్డర్లను అందుకుంది. క్యూ3లో ఈ కంపెనీ ఆర్డర్స్ వాల్యూ రూ. 11,594.3 కోట్లుగా ఉంది. ఖవ్డా (గుజరాత్) నుంచి నాగ్‌పూర్ (మహారాష్ట్ర) వరకు ట్రాన్స్‌మిట్టింగ్ రెనివబుల్ ఎనర్జీ కోసం లార్జ్ హై వోల్టేజ్ డైరెక్ట్ కరెంట్ ఆర్డర్ విలువ పరంగా అతిపెద్దది కావడం ప్రధాన కారణం.

ఈ స్టాక్ 52 వారాల గరిష్ట విలువ రూ. 16,549.95 గా ఉండగా.. కనిష్ట ధర రూ. 5590 గా ఉంది. ఇక కంపెనీ మార్కెట్ విలువ రూ. 52.03 వేల కోట్లు. గత 5 రోజుల్లో చూస్తే ఈ స్టాక్ 4 శాతానికిపైగా పెరగ్గా.. నెల రోజుల్లో 14 శాతం పతనమైంది. 6 నెలల్లో 3 శాతం పుంజుకోగా.. ఇదే సమయంలో ఏడాది వ్యవధిలో 118 శాతం పుంజుకుంది. గత ఐదేళ్లలో ఇది 81 వేల శాతానికిపైగా పెరిగింది. బడ్జెట్‌కు ముందు దేశీయ స్టా మార్కెట్ సూచీలు గురువారం రోజు ఒడుదొడుకుల్లో ట్రేడవుతున్నాయి. వార్త రాసే సమయంలో సెన్సెక్స్ 250 పాయింట్ల లాభంతో 76,780 లెవెల్స్‌లో ఉంది. నిఫ్టీ 100 పాయింట్లు పుంజుకొని 23,260 లెవెల్స్‌లో కొనసాగుతోంది.

# దూసుకువస్తున్న పెద్ద ఆస్టరాయిడ్..

భూమి వైపుకు దూసుకువస్తున్న 130 %-% 300 అడుగుల పొడవు గల గ్రహశకలం2024 డిసెంబర్ 27న నాసాకి చెందిన అస్టరాయిడ్ టెర్రెస్ట్రియల్ ఇంపాక్ట్ లాస్ట్ అలర్ట్ సిస్టం ఈ గ్రహ శకలాన్ని గుర్తించిన వైనం

ఈ గ్రహ శకలం భూమిని ఢీకొట్టే ఛాన్స్ ఒక్క శాతమేనని చెప్పిన నాసా శాస్త్రవేత్తలు

భూమి వైపు దూసుకొస్తున్న గ్రహశకలాలు ఎప్పటికప్పుడు ప్రపంచాన్ని భయపెడుతూనే ఉన్నాయి. తాజాగా, అమెరికా అంతరిక్ష పరిశోధనా సంస్థ (నాసా) శాస్త్రవేత్తలు 2024 వైఆర్ 4 అనే గ్రహశకలాన్ని కనుగొన్నారు. ఇది 2032లో భూమిని ఢీకొనే అవకాశం ఉందని నాసా శాస్త్రవేత్తలు అభిప్రాయపడుతున్నారు. అబుదాబిలోని ఇంటర్నేషనల్ ఆస్ట్రానమీ సెంటర్ (ఐఏసీ) తెలిపిన వివరాల ప్రకారం.. ఈ భారీ గ్రహశకలం భూమివైపు దూసుకువస్తోందని, దీని పరిమాణం సుమారు ఫుట్‌బాల్ మైదానం కంటే పెద్దగా ఉంటుందని తెలిపారు. ఇది భూమి వైపు చాలా వేగంగా వస్తోందని, భూమిని ఢీకొట్టే అవకాశాలు ఎక్కువగా ఉన్నాయని, 2032లో భూమిని ఢీకొట్టవచ్చని అంచనా వేశారు. 130 %-% 300 అడుగుల పొడవు గల ఈ గ్రహశకలం మానవాళి మొత్తానికి తక్కువ ప్రమాదకారి అయినా ఒక పెద్ద నగరాన్ని తీవ్రంగా నాశనం చేయగల శక్తిని కలిగి ఉండొచ్చని శాస్త్రవేత్తలు అభిప్రాయపడుతున్నారు. దీని ప్రభావం 8 మెగా టన్నుల టీఎన్‌టీకి సమానమని, ఇది హిరోషిమాపై ప్రయోగించిన అణుబాంబు కన్నా 500 రెట్లు శక్తివంతమైనది అయి ఉండవచ్చని వారు వెల్లడించారు. అయితే, 2032 డిసెంబర్ 22న ఈ గ్రహశకలం భూమిని ఢీకొట్టే అవకాశం ఒక్క శాతమేనని, అంటే 99 శాతం దాని ప్రభావం భూమిపై ఉండదని వారు తెలిపారు. కాగా, ఈ గ్రహశకలాన్ని 2024 డిసెంబర్ 27న నాసాకు చెందిన ఆస్టరాయిడ్ టెర్రెస్ట్రియల్ ఇంపాక్ట్ లాస్ట్ అలర్ట్ సిస్టమ్ కనిపెట్టింది.

# కేంద్రానిది సవతి తల్లి ప్రేమ!

తీవ్ర అన్యాయం జరిగిందని నిరసిస్తూ... ఆదివారం సాయంత్రం హైదరాబాద్ ట్యాంక్‌బండ్‌లోని అంబేద్కర్ విగ్రహం కూడలిలో పీసీసీ ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా మహేశ్‌కుమార్‌గౌడ్ మాట్లాడుతూ... “బిహార్, దిల్లీ ఎన్నికల్లో గెలవడానికి మాత్రమే రూపకల్పన చేసిన బడ్జెట్ ఇది. కేంద్ర ప్రభుత్వాన్ని ఎండగట్టాల్సిన సమయం ఆసన్నమైంది. సీఎం రేవంత్‌రెడ్డి, ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, రాష్ట్ర మంత్రులు పలుమార్లు దిల్లీ వెళ్లి... విన్నవించినా కనికరించని ప్రధాని మోదీ తీరుని వ్యతిరేకిస్తున్నాం. ప్రతీ చిన్న విషయంలో పెద్దగా మాట్లాడే కేసీఆర్, కేటీఆర్, హరీశ్‌రావులు ఈ విషయంలో ఎందుకు పెదవి విప్పడం లేదు? భాజపాతో లోపాయికారీ ఒప్పందాలుంటే పక్కనపెట్టండి. మాతో కలిసి రండి. దేశ రాజధానిపై దండయాత్రకు పోదాం. రాష్ట్రానికి రావాల్సిన పన్నుల వాటా, అభివృద్ధి పనుల సాధనకు ఒంటరిగా పోరాడుతున్న సీఎంతో కలిసి నడుద్దాం. రాష్ట్రం నుంచి కిషన్‌రెడ్డి, సంజయ్‌లు కేంద్ర మంత్రులుగా ఉన్నా... మనకు వచ్చింది గుండు సున్నా. తెలంగాణకు జరిగిన అన్యాయంపై ప్రధానిని ఎందుకు నిలదీయడం లేదు? అలాంటి మీకు మంత్రి పదవులెందుకు? రాజీనామాలు చేయండి” అని స్పష్టంచేశారు.

ప్రజాసంక్షేమం కనిపించడం లేదు: సీతక్క అనంతరం మంత్రి సీతక్క మాట్లాడుతూ... “కేంద్ర బడ్జెట్‌లో స్వార్థం మినహా ప్రజాసంక్షేమం కనిపించడం లేదు. రాష్ట్రంపై రూ.7 లక్షల కోట్ల అప్పున్నా... అభివృద్ధి, సంక్షేమాన్ని జోడెద్దుల్లా నడిపిస్తుంటే ఓర్వలేకపోతున్నారు” అని ఆరోపించారు. మంత్రి పొన్నం ప్రభాకర్ మాట్లాడుతూ... “కేంద్రాన్ని గత ప్రభుత్వం నిధులు అడగలేదనే కారణంతో తెలంగాణను నిర్లక్ష్యం చేశారు. ఇప్పుడు సీఎం, మంత్రులు, ఎంపీలు... ప్రధానితోపాటు అన్ని కేంద్ర శాఖల చుట్టూ తిరుగుతున్నా అన్యాయమే చేశారు” అని అన్నారు. కార్యక్రమంలో ఏఐసీసీ నేత సంపత్‌కుమార్, ప్రభుత్వ సలహాదారు షబ్బీర్ అలీ, సీఎం సలహాదారు వేం నరేందర్‌రెడ్డి, నేతలు చిన్నారెడ్డి, రోహిణ్‌రెడ్డి, అనిల్‌కుమార్, సునీతారావు, సాయికుమార్, పి.వి.రవిశేఖర్‌రెడ్డి. విజయారెడ్డి తదితరులు పాల్గొన్నారు. అంబేద్కర్ విగ్రహానికి పూలు సమర్పిస్తున్న మంత్రి పొన్నం ప్రభాకర్, చిత్రంలో ఎంపీ అనిల్ కుమార్‌కేంద్ర బడ్జెట్‌పై జిల్లాల్లో నిరసన తెలపాలి కేంద్ర బడ్జెట్‌లో తెలంగాణపై వివక్ష చూపినందుకు నిరసనగా నేడు అన్ని జిల్లా కేంద్రాల్లో భారీ నిరసనలు చేపట్టాలని పీసీసీ అధ్యక్షుడు మహేశ్‌కుమార్‌గౌడ్ ఒక ప్రకటనలో పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు.

# కోడ్ పేరిట పథకాలను ఆపే కుట్ర

“ఎంపీటీసీ, జడ్పీటీసీ ఎన్నికల కోడ్ పేరుతో సంక్షేమ పథకాలను ఆపేందుకు రాష్ట్ర ప్రభుత్వం కుట్ర పన్నుతోంది. హామీ ఇచ్చిన పథకాలన్నీ అమలు చేశాకే రాష్ట్ర ప్రభుత్వం స్థానిక సంస్థల ఎన్నికలకు వెళ్లాలి” అని మాజీ మంత్రి టి.హరీశ్‌రావు స్పష్టంచేశారు.వాటిని అమలు చేశాకే ప్రభుత్వం ఎన్నికలకు వెళ్లాలి: హరీశ్‌రావు

కౌడిపల్లి, “ఎంపీటీసీ, జడ్పీటీసీ ఎన్నికల కోడ్ పేరుతో సంక్షేమ పథకాలను ఆపేందుకు రాష్ట్ర ప్రభుత్వం కుట్ర పన్నుతోంది. హామీ ఇచ్చిన పథకాలన్నీ అమలు చేశాకే రాష్ట్ర ప్రభుత్వం స్థానిక సంస్థల ఎన్నికలకు వెళ్లాలి” అని మాజీ మంత్రి టి.హరీశ్‌రావు స్పష్టంచేశారు. ఇప్పటికే కాంగ్రెస్‌కు ఒకసారి ఓట్లేసి మోసపోయారని, మళ్లీ అలాంటి పొరపాటు చేయరాదని ప్రజలకు సూచించారు. ఆదివారం మెదక్ జిల్లా కౌడిపల్లి మండలం తిమ్మాపూర్‌లో రేణుకా ఎల్లమ్మతల్లి విగ్రహ ప్రతిష్ఠాపనకు నర్సాపూర్ ఎమ్మెల్యే సునీతారెడ్డితో కలిసి ఆయన హాజరయ్యారు. ఈ సందర్భంగా విలేకరులతో హరీశ్ మాట్లాడుతూ... “రేవంత్‌రెడ్డి చెప్పే మాయమాటలు నమ్మరాదు. రాజ్యాంగంపై ప్రమాణం చేసిన సీఎం మాట తప్పారు. రైతుభరోసా డబ్బులు ఖాతాల్లో పడతాయని జనవరి 26న అన్నదాతలు రాత్రంతా ఎదురుచూసినా

సెల్‌ఫోన్లలో టకీటకీ శబ్దమేదీ రాలేదు. కేసీఆర్ పదేళ్లలో తెలంగాణ గ్రామీణ ఆర్థికవ్యవస్థను బలోపేతం చేశారు. వివిధ రకాల వృత్తులను ప్రోత్సహించారు. కాంగ్రెస్ మాత్రం ఉన్న పథకాలను పూర్తిగా బంద్ చేసింది. వారి మోసాలను గుర్తించి ఎన్నికల్లో తగిన గుణపాఠం చెప్పాలి” అని ప్రజలకు పిలుపునిచ్చారు.

# తెలంగాణలో తేలిన కులగణన.. ఏ కులాల వారు ఎంత మంది ఉన్నారంటే?

ఈనెల 4వ తేదీన కేబినెట్ ముందు కులగణన సర్వే నివేదికను ప్రవేశపెడతామని ఉత్తమ్ స్పష్టం చేశారు. అదే రోజున అసెంబ్లీ ప్రత్యేక సమావేశాలు ఏర్పాటు చేయనున్నట్లు వెల్లడించారు.



తెలంగాణ ప్రభుత్వం రాష్ట్రంలో ప్రతిష్టాత్మకంగా చేపట్టిన కులగణన, సామాజిక సర్వే లెక్క తేలింది. వీటికి సంబంధంచిన నివేదికను మంత్రి వర్గ ఉపసంఘానికి అధికారులు అందించారు. ఈ నేపథ్యంలోనే కులగణన అంశంపై మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి నేతృత్వంలోని కేబినెట్ సబ్‌కమిటీ సమావేశం అయి చర్చించింది. ఈనెల 4వ తేదీన రాష్ట్ర కేబినెట్ ముందుకు రానుంది.

రాష్ట్రంలో కులగణన, సామాజిక సర్వే నివేదిక కేబినెట్ సబ్ కమిటీకి అందింది. కులగణన, సామాజిక సర్వేలో రాష్ట్రంలోని 3.50 కోట్ల మంది వివరాలు అందించారని మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి మీడియాకు వెల్లడించారు. ఈ కులగణన, సామాజిక సర్వే నివేదికను మంత్రివర్గం ముందుకు తీసుకెళ్లనున్నట్లు ప్రకటించారు. రాష్ట్రంలో వెనుకబడిన తరగతులకు న్యాయం చేయాలనేదే కాంగ్రెస్ ప్రభుత్వం లక్ష్యం అని మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి వెల్లడించారు. ఈ సందర్భంగా రాష్ట్రంలో కులగణన అంశంపై ప్లానింగ్ డిపార్ట్‌మెంట్ ప్రిన్సిపల్ సెక్రటరీ సందీప్ సుల్తానియా కేబినెట్ సబ్‌కమిటీకి రిపోర్ట్ సమర్పించారు. కులగణన అంశంపై కేబినెట్ సబ్‌కమిటీ ముగిసిన తర్వాత మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి మీడియాకు వెల్లడించారు. కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ ఆశయం మేరకు రాష్ట్రంలో సామాజిక, కులగణన సర్వే చేపట్టినట్లు తెలిపారు. స్వాతంత్ర్యం రాకముందు నుంచి దేశంలో జనగణన జరుగుతోందని పేర్కొన్న ఉత్తమ్.. అసలైన పేదలను గుర్తించేందుకు కులగణన జరగలేదని వెల్లడించారు. రాష్ట్రవ్యాప్తంగా సామాజిక, ఆర్థిక, విద్య, ఉపాధి, కులగణన చేయాలని అసెంబ్లీ తీర్మానించిందని చెప్పారు.

బలహీనవర్గాల అభ్యున్నతికి అవసరమైన వివరాల సేకరణకు కులగణన చేపట్టినట్లు వెల్లడించారు. సామాజిక కులగణన సర్వేలో 1,03,889 మంది ఎన్యుమరేటర్లు పాల్గొన్నారని స్పష్టం చేశారు. రాష్ట్రంలోని 3.50 కోట్ల మంది ప్రజలు సర్వేలో పాల్గొని వివరాలు అందించారని చెప్పారు. ఇది రాష్ట్ర జనాభాలో 96.9 శాతం అని వెల్లడించారు. రాష్ట్రంలోని 3.1శాతం మంది.. అంటే 16 లక్షల మంది పలు కారణాల వల్ల వివరాలు అందించలేదని ఉత్తమ్ కుమార్ రెడ్డి స్పష్టం చేశారు. ఇందులో ప్రజల సామాజిక, ఆర్థిక, రాజకీయ, ఉపాధి సహా పలు అంశాలపై సమగ్ర అధ్యయనం జరిగిందని చెప్పారు. ఈ కులగణనను అడ్డుకోవాలని కొందరు ప్రయత్నించినా.. అధికారులు సక్సెస్‌ఫుల్‌గా పూర్తి చేసినట్లు వెల్లడించారు. ఈనెల 4వ తేదీన కేబినెట్ ముందు కులగణన సర్వే నివేదికను ప్రవేశపెడతామని ఉత్తమ్ స్పష్టం చేశారు. అదే రోజున అసెంబ్లీ ప్రత్యేక సమావేశాలు ఏర్పాటు చేయనున్నట్లు వెల్లడించారు. కేబినెట్‌లో చర్చించిన వెంటనే దాన్ని అసెంబ్లీలో ప్రవేశ పెడతామని తెలిపారు.



## కాంగ్రెస్ ఎమ్మెల్యేల భేటీ నిజమే..

కాంగ్రెస్ ఎమ్మెల్యేలు రహస్యంగా భేటీ అయినట్లు వస్తున్న వార్తలపై ఆ పార్టీ ఎమ్మెల్యే అనిరుధ్ రెడ్డి స్పందించారు. ఎమ్మెల్యేల సమావేశం నిజమేనని అన్నారు. కాకపోతే తాము రహస్యంగా భేటీ కాలేదని చెప్పారు. నియోజకవర్గాల అభివృద్ధి కోసం ఎమ్మెల్యేలు ఓ చోట కలిసి మాట్లాడుకోవటం రహస్య భేటీ ఎలా అవుతుందని ప్రశ్నించారు. త్వరలోనే సీఎం రేవంత్, దీపాదాస్ మున్షీని కలిశాక అన్ని విషయాలు చెబుతానని అన్నారు.

అధికార కాంగ్రెస్ పార్టీకి చెందిన 10 మంది ఎమ్మెల్యేలు రహస్యంగా భేటీ అయినట్లు ప్రచారం జరుగుతోంది. ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాకు చెందిన ఓ ఎమ్మెల్యే.. హైదరాబాద్ శివారులోని ఓ ఫాంహౌస్‌లో ఎమ్మెల్యేలతో సమావేశం ఏర్పాటు చేసినట్లు సోషల్ మీడియాలో విస్తృతంగా ప్రచారం వార్తలు వస్తున్నాయి. ఓ మంత్రి వ్యవహార శైలిపై వీరు గుర్రుగా ఉన్నారని.. పనుల కోసం కలిసి ఒత్తిడి చేద్దామని భేటీలో చర్చించినట్లు గత రెండు, మూడ్రోజులుగా ప్రచారం జరుగుతోంది. శనివారం సాయంత్రం జరిగిన మంత్రుల భేటీలో ఈ వ్యవహారంపై చర్చ జరగ్గా.. గట్టిగానే వ్యవహరిద్దామని సీఎం, కొందరు మంత్రులు పేర్కొన్నట్లు తెలిసింది.

ఈ నేపథ్యంలో కాంగ్రెస్ ఎమ్మెల్యేల రహస్య సమావేశంపై జడ్చర్ల ఎమ్మెల్యే అనిరుధ్ రెడ్డి క్లారిటీ ఇచ్చారు. ఎమ్మెల్యేలు సమావేశమైన మాట నిజమేనని స్పష్టం చేసారు. కానీ తాము రహస్యంగా భేటీ కాలేదని చెప్పారు. నియోజకవర్గాల అభివృద్ధి కోసం ఎమ్మెల్యేలు కలిసి మాట్లాడుకోవద్దా? అని ప్రశ్నించారు. తాను ఏ ఫైల్ కూడా రెవెన్యూ మంత్రి దగ్గర పెట్టలేదన్నారు. సీఎం రేవంత్, దీపాదాస్ మున్షీని కలిశాక పూర్తి వివరాలు చెబుతానని అన్నారు.

ఎమ్మెల్యేలు భేటీ అయిన మాట నిజమే. నేను ఏ ఫైల్‌ను రెవెన్యూ మంత్రి దగ్గర పెట్టలేదు. అసలు అది ఏ ఫైల్ అనేది ఎంపీ మల్లు రవి గారు చెప్పాలి. మేమేం రహస్యంగా సమావేశం కాలేదు. అధిష్టానికి చెప్పాల్సింది చాలానే ఉంది. రాష్ట్ర కాంగ్రెస్ వ్యవహారాల ఇన్‌చార్జి దీపాదాస్ మున్షీని కలిశాక అన్ని విషయాలు మాట్లాడుతా.. అన్ని వివరాలు చెబుతా. నా క్యారెక్టర్‌ను తప్పుగా చూపిస్తే ఊరుకునేదే లేదు. ఎవరి చరిత్ర ఏంటో అందరికీ తెలిసిందే. అన్ని ఆధారాలతో పెద్దలతో మాట్లాడుతా' అని అనిరుధ్ రెడ్డి సంచలన కామెంట్స్ చేశారు.

ఇదిలా ఉండగా.. కాంగ్రెస్ ఎమ్మెల్యేల రహస్య భేటీ వార్తలపై ఎమ్మెల్యేలు ఒక్కొక్కరుగా స్పందిస్తున్నారు. తాము ఏ రహస్య సమావేశంలోనూ పాల్గొనలేదని వరంగల్ ఈస్ట్ ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి, ఆలేరు ఎమ్మెల్యే బీర్ల ఐలయ్య వెల్లడించారు. ఉద్దేశపూర్వకంగా కొందరు కావాలనే ప్రభుత్వంపై కుట్రలు చేస్తున్నారన్నారు. తనపై తప్పుడు ప్రచారం చేసిన వారిపై పరువు నష్టం దావా వేయనున్నట్లు రాజేందర్ రెడ్డి పేర్కొన్నారు. ముఖ్యమంత్రి రేవంత్‌ను కలిసి ఈ అంశంపై ఫిర్యాదు చేస్తానన్నారు.

## కాంగ్రెస్ ప్రభుత్వం హత్యే



కాంగ్రెస్ పార్టీ అసమర్థ పాలనతో ఆత్మహత్య చేసుకున్న బిల్డర్ వేణుగోపాల్ రెడ్డి కుటుంబాన్ని మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే హరీశ్‌రావు పరామర్శించారు. కాంగ్రెస్ పార్టీ అసమర్థ పాలనతో ఆత్మహత్య చేసుకున్న బిల్డర్ వేణుగోపాల్ రెడ్డి కుటుంబాన్ని మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే హరీశ్‌రావు పరామర్శించారు. ఈ సందర్భంగా హరీశ్‌రావు మాట్లాడుతూ.. వేణుగోపాల్ రెడ్డి ఆత్మహత్య కాంగ్రెస్ ప్రభుత్వం హత్య అని పేర్కొన్నారు. ఆ కుటుంబాన్ని చూస్తుంటే కళ్లల్లో నీళ్లు తిరుగుతున్నాయి. ఆయన భార్య చెబుతుంది ఏ బ్యాంక్‌కు వెళ్లినా నువ్వు బిల్డర్ అప్పు ఇవ్వమని చెప్పారట. ఒకప్పుడు బిల్డర్ వెనుకాల పడి అప్పులు ఇచ్చే బ్యాంకులు.. 14 నెలల కాంగ్రెస్ పాలన పుణ్యమా అని బిల్డర్ అంటే అప్పు పుట్టని పరిస్థితి వచ్చింది. భార్య పేరు మీద లోన్ అప్లై చేసి.. కో అప్లికేంట్‌గా వేణుగోపాల్ రెడ్డి ఉంటే.. నువ్వు బిల్డర్ కాబట్టి అప్పు ఇవ్వమని బ్యాంకర్లు అన్నారట అని హరీశ్‌రావు తెలిపారు. ఈ 14 నెలల కాంగ్రెస్ పాలనలో ఒక అపార్ట్‌మెంట్ కూడా అమ్ముడు పోక, బ్యాంకులకు పోతే అప్పు రాక, దిక్కుతోచని పరిస్థితుల్లో ఆత్మస్థైర్యం కోల్పోయి వేణుగోపాల్ రెడ్డి ఆత్మహత్య చేసుకున్నాడు. నిజంగా యువ బిల్డర్. ఇప్పుడిప్పుడే పైకి వస్తున్నాడు.. 39 ఏండ్ల వేణుగోపాల్ రెడ్డికి ఐదేండ్ల పాప ఉంది. రాత్రంతా నాన్న.. నాన్న అని పాప ఏడుస్తూ ఉందని తల్లి రోదిస్తుంటే హృదయం ద్రవించిపోయింది. ఇప్పటికైనా రేవంత్ రెడ్డి కళ్లు తెరవాలి.. మరిన్ని ప్రాణాలు పోకుండా చూడండి అని ఆ కుటుంబ సభ్యులు మాట్లాడుతున్నారు. కాంగ్రెస్ పాలనలో రైతులు, చేనేత కార్మికులు, ఆటో డ్రైవర్లు ఆత్మహత్య చేసుకున్నారు.. చివరకు బిల్డర్లు కూడా ఆత్మహత్యలు చేసుకునే పరిస్థితి వచ్చింది అని హరీశ్‌రావు పేర్కొన్నారు.



## 15 వేల కుటుంబాలకు రిలీఫ్..

మూసీ నిర్వాసితుల కోసం తెలంగాణ ప్రభుత్వం నిధులు విడుదల చేసింది. మూసీ నిర్వాసితులకు ఆర్థిక సాయం కోసం రూ37.50 కోట్లు విడుదల చేసింది. ఈ మేరకు తెలంగాణ పురపాలకశాఖ నుంచి ఉత్తర్వులు జారీ అయ్యాయి. మూసీ పరివాహక ప్రాంతం నుంచి ఇల్లు ఖాళీ చేసి వెళు న్న వారికి రూ.25000 చొప్పున ఆర్థిక సహాయం చేస్తామని తెలంగాణ సర్కారు గతంలో ప్రకటించింది. ఆ మేరకు 15 వేల కుటుంబాలకు, 25 వేలరూపాయలు చొప్పున పంపిణీ చేసేందుకు ఈ నిధులను శనివారం విడుదల చేశారు.

మూసీ నిర్వాసితులకు తెలంగాణ సర్కారు రిలీఫ్ ఇచ్చింది. నిర్వాసితులకు ఆర్థిక సాయం అందించటం కోసం తెలంగాణ ప్రభుత్వం నిధులు విడుదల చేసింది. ఈ మేరకు మూసీ రివర్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్?కు.. తెలంగాణ ప్రభుత్వం రూ.37 కోట్ల 50 లక్షలు నిధులు విడుదల చేస్తూ శనివారం ఉత్తర్వులు జారీ చేసింది. తెలంగాణ పురపాలక శాఖ నుంచి ఈ మేరకు ఉత్తర్వులు జారీ అయ్యాయి. కాలుష్య కారకాలతో నిండిపోయిన మూసీ నదిని పునరుజ్జీవం చేయాలని తెలంగాణ సర్కారు నిర్ణయించిన సంగతి తెలిసిందే. అందులో భాగంగా మూసీ సుందరీకరణ కోసం చర్యలు చేపడుతున్నారు.

ఈ క్రమంలోనే మూసీ పరివాహక ప్రాంతాల్లో నివశించేవారిని ప్రభుత్వం ఖాళీ చేయిస్తోంది. మూసీ పరివాహక ప్రాంతంలో అక్రమ నిర్మాణాలు ఏర్పాటు చేసుకున్న వారిని అధికారులు అక్కడి నుంచి ఖాళీ చేయిస్తున్నారు. నిర్వాసితులకు పునరావాసంతో పాటుగా.. ఆర్థిక సాయం చేస్తామని తెలంగాణ సర్కారు గతంలో ప్రకటించింది. అందులో భాగంగానే మూసీ పరివాహక ప్రాంతం నుంచి ఇల్లు ఖాళీ చేసి వెళు న్న కుటుంబాలకు రూ. 25 వేలు ఆర్థిక సాయం అందిస్తోంది. ఈ క్రమంలోనే 15 వేల కుటుంబాలకు 25 వేల రూపాయల చొప్పున ఆర్థిక సాయం అందించేందుకు.. ఈ రూ.37.50 కోట్లను విడుదల చేశారు.

మూసీ నిర్వాసితుల కోసం తెలంగాణ ప్రభుత్వం అనేక చర్యలు తీసుకుంటోంది. నిర్వాసితులకు డబుల్ బెడ్ రూమ్ ఇళ్లు ఇచ్చేందుకు సిద్ధమైంది. అలాగే హైదరాబాద్‌లోని వేర్వేరు ప్రాంతాల్లో ఉన్న 16 వేలకు పైగా ఇళ్లను వీరికి ఇచ్చేలా గతంలోనే నిర్ణయం తీసుకున్నారు. ఇక మూసీ నది అభివృద్ధి ప్రాజెక్టులో సైతం అధికారులు వేగం పెంచారు. అభివృద్ధి పనులను ప్రారంభించేం దుకు అవసరమైన భూసేకరణ చేపట్టాలని నిర్ణయించారు.

మూడు జిల్లాల పరిధిలోని మూసీ నదిపై సర్వే చేసిన అధికారులు.. మూసీ నదీ గర్భంలోనూ, బఫర్‌జోన్‌లోనూ సుమారు పదివేలకుపైగా నిర్మాలను గుర్తించారు. జిల్లా కలెక్టర్ల నేతృత్వంలో ఇంటింటి సర్వే కూడా నిర్వహించారు. అలాగే పునరావాసం కల్పించిన తర్వాతే ఆక్రమణలను తొలగిస్తామని అధికారులు చెప్తున్నారు. అర్హులైన ప్రతి ఒక్కరికీ నష్టపరిహారం, పునరావాసం అందిస్తామని స్పష్టం చేస్తున్నారు.

## తెలంగాణలోని స్కూళ్లకు సెలవు ఉందా?..

విద్యాసంస్థల యాజమాన్యాలపై ఈ సెలవు ఇచ్చేది ఆధారపడి ఉంటుంది. అటు ఏపీలో ఎలాంటి ఆప్షనల్ హాలిడే లేదు. తెలుగు రాష్ట్రాల్లోని పలు ఆలయాల్లో వసంత పంచమి వేడుకలు ఘనంగా జరుగుతున్నాయి. పంచమి ఇవాళా? రేపా? అని ప్రజల్లో ఉన్న సందిగ్ధతపై పండితులు ఇప్పటికే క్లారిటీ ఇచ్చారు. నేడు ఉదయం 9.45 గంటల వరకు చవితి తిథి ఉంది. ఆ తర్వాత పంచమి మొదలవుతుందన్నారు. రేపు ఉ.6.50 నిమిషాలకు సూర్యోదయం ఉంటే, పంచమి తిథి ఉ.6.52 వరకు ఉందని చెప్పారు. ఇవాళ ఉ.7:09 గంటల నుంచి మ.12:35 గంటల వరకు సరస్వతి పూజకు మంచి సమయని చెప్పారు. ఇక వసంత పంచమి సందర్భంగా నిర్మల్ జిల్లా బాసర ఆలయానికి భక్తులు పోటెత్తారు. ఆదివారం సెలవు రోజు కావడంతో భారీ సంఖ్యలో తరలివస్తున్నారు. అక్షరాభ్యాస పూజలకు దాదాపు 2 గంటలు, అమ్మవారి దర్శనానికి 3 గంటల సమయం పడుతోంది. అయితే వసంత పంచమి పర్వదినాన్ని ఈ రోజు జరుపుకొంటున్నప్పటికీ రేపు కూడా పంచమి తిథి ఉంది. దీంతో తెలంగాణ ప్రభుత్వం సోమవారం ఆప్షనల్ హాలిడే ఇచ్చింది. దీని ప్రకారం రేపు (ఫిబ్రవరి 3) సెలవు విద్యాసంస్థల యాజమాన్యాలపై ఆధారపడి ఉండను ంది. వసంత పంచమికి పెద్ద ఎత్తున అక్షరాభ్యాస పూజలు చేస్తారు. దీంతో తెలంగాణ సర్కార్ స్కూళ్ల కు ఆప్షనల్ హాలీడే ఇచ్చింది. దీంతో ఆయా సూళ్లు తమ అవసరాలను భట్టి సెలవు ప్రకటించుకునే ఛాన్స్ ఉంది. స్కూళ్లు యథావిథిగా కొనసాగు తాయని చెప్పారు.

ఇక 2025–26 విద్యా సంవత్సరానికిగానూ గురుకులాల్లో 5–9 తరగతుల ప్రవేశాలకు రేవంత్ ప్రభుత్వం దరఖాస్తు గడువును పొడిగించింది. ఫిబ్రవరి 1తో గడువు ముగియగా.. ఈ నెల 6 వరకు విద్యార్థులు అప్లయ్ చేసుకోవచ్చునని తెలిపారు. ఇప్పటి వరకు 1,46,394 దరఖాస్తులు వచ్చినట్లు అధికారులు వెల్లడించారు.

## సొంతిల్లు లేక రాత్రంతా అంబులెన్స్‌లోనే మృతదేహం..!



రాజన్న సిరిసిల్ల జిల్లా ముస్తాబాద్‌లో అమానవీయ ఘటన వెలుగులోకి వచ్చింది. ఓ వ్యక్తి అనారోగ్య సమస్యలతో చనిపోగా.. సొంతిల్లు లేకపోటవంతో రాత్రంతా అంబులెన్స్‌లోనే మృతదేహాన్ని ఉంచాల్సి వచ్చింది. కుటుంబసభ్యులు కూడా శవంతో పాటుగా రాత్రంతా రోడ్డుపైనే గడిపారు. స్పందించిన స్థానికులు అంత్యక్రియలకు సాయం చేశారు. వారిది రెక్కాడితే కానీ డొక్కాడని నిరుపేద చేనేత కుటుంబం. సొంత ఇల్లు కూడా లేదు. అద్దె ఇంట్లోనే కాలం వెల్లదీస్తున్నారు. ఇంటి పెద్ద అనారోగ్యంతో మృతి చెందాడు. దీంతో మృతదేహాన్ని అద్దె ఇంట్లోకి తీసుకెళ్లలేని పరిస్థితి. సొంత గూడు లేకపోవటంతో.. రాత్రంతా అంబులెన్స్‌లోనే మృతదేహాన్ని ఉంచారు. కుటుంబ సభ్యులు కూడా అంబులెన్స్‌లోనే తెల్లవారే వరకు గడిపారు. ఆ తర్వాత మృతదేహాన్ని నడి వీధిలోనే ఉంచి అంత్యక్రియలకు ఏర్పాటు చేశారు. ఈ హృదయవిదారకర ఘటన రాజన్న సిరిసిల్ల జిల్లాలో చోటు చేసుకుంది.

సిరిసిల్ల జిల్లా ముస్తాబాద్ మండల కేంద్రానికి చెందిన సంతోష్ అనే వ్యక్తి చేనేత కార్మికుడు. అతడికి భార్య, ముగ్గురు ఆడ పిల్లలు, ఓ కుమారుడు సంతానం. సంతోష్‌ది నిరుపేద కుటుంబం కావటంతో సొంతిల్లు కట్టుకోలేదు. పట్టణంలోని అద్దె ఇంట్లోనే ఉంటూ చేనేత కార్మికుడిగా జీవనం సాగిస్తున్నాడు. అయితే గత కొంత కాలంగా అనారోగ్యంతో బాధపడుతున్న సంతోష్.. ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స పొందుతూ శనివారం సాయంత్రం మృతి చెందాడు. దీంతో హాస్పిటల్ సిబ్బంది మృతదేహాన్ని అప్పగించారు. అయితే వారికి పట్టణంలో సొంతిల్లు లేదు. అద్దె ఇంట్లోకి తీసుకువెళ్లలేని పరిస్థితి.

ఏం చేయాలో తోచని ఆ కుటుంబ సభ్యులు.. అంబులెన్స్‌లోనే రాత్రంతా శవాన్ని ఉంచారు. మృతదేహంతో పాటు కుటుంబ సభ్యులు కూడా రాత్రంతా నడిరోడ్డుపైనే గడిపారు. ఈ ఘటన చూసి చలించి పోయిన కొందరు స్థానికులు తోచినంత సాయం చేసి ఆ కుటుంబానికి ఆర్థిక సాయం చేశారు. విషయం తెలుసుకున్న సిరిసిల్ల నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జి కేకే మహేందర్ రెడ్డి సంతోష్ కుటుంబాన్ని ఆదుకుంటామని భరోసా కల్పించారు. ప్రభుత్వం తరుపున అన్ని విధాలుగా ఆదుకుంటామన్నారు. జిల్లా కలెక్టర్ ఘటనపై స్పందించారు. ఆ కుటుంబ పరిస్థితికి చలించిపోయి డబుల్ బెడ్ రూం ఇల్లు మంజూరు చేశారు. అంత్యక్రియలకు ఏర్పాట్లు చేయాలని అధికారులను ఆదేశించారు. దీంతో స్థానికులు, అధికారుల సాయంతో సంతోష్ అంత్యక్రియలు పూర్తి చేశారు.

## భర్తకు తెలియకుండా వ్యక్తికి అప్పు..



తెలిసిన వ్యక్తే కదా అని వడ్డీకి ఆశపడి భర్తకు తెలియకుండా నగలు తాకట్టు పెట్టి అప్పు ఇచ్చింది. ఆపదలో ఉన్నానని ఆదుకోవాలని వేడుకోవడంతో డబ్బులు ఇచ్చింది. అయితే అతడు డబ్బులు తిరిగి ఇవ్వకపోవటంతో భర్తకు విషయం తెలిసింది. దీంతో దంపతులు మధ్య తరుచూ గొడవలు జరిగాయి. మనస్తాపం చెందిన మహిళా ఫ్యానుకు ఉరేసుకొని సూసైడ్ చేసుకుంది.

భర్తకు తెలియకుండా ఓ వ్యక్తికి అప్పు ఇచ్చింది. ఆపదలో ఉన్నానంటే పెద్ద మనసుతో డబ్బులు ఇచ్చింది. అయితే అప్పు తీసుకున్న వ్యక్తి డబ్బులు తిరిగి ఇవ్వలేదు. ఈ విషయం భర్తకు తెలిసి ఇంట్లో గొడవలు మ్మొదలయ్యాయి. దీంతో మనస్తాపం చెందిన మహిళ.. కఠిన నిర్ణయం తీసుకుంది. ఇక బతకటం కష్టమని ఉరేసుకొని ప్రాణాలు తీసుకుంది. ఈ ఘటన హైదరాబాద్ జీడిమెట్ల పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది.

జీడిమెట్ల సీఐ గడ్డం మల్లేశ్ తెలిపిన వివరాల ప్రకారం.. చందు, లావణ్య దంపతులు టీఎస్ఐఐసీ కాలనీలో ఉంటున్నారు. చందు ఓ ప్రైవేటు కంపెనీలో జాబ్ చేస్తుండగా.. లావణ్య టైలర్‌గా పని చేస్తోంది. అయికే వీరికి తొమ్మిది నెలల క్రితం శివరామ్ అనే వ్యక్తి పరిచయమయ్యాడు. అతడికి రూ.2 లక్షలు అప్పుగా ఇచ్చారు. ఆ తర్వాత మరోసారి మరోసారి డబ్బులు కావాలని శివరామ్ లావణ్యను కోరాడు. వడ్డీకి ఆశపడ్డ లావణ్య ఈ సారి భర్తకు తెలియకుండా బంగారు నగలు తాకట్టుపెట్టి రూ.3 లక్షలు అప్పుగా ఇచ్చింది. అయితే తీసుకున్న అప్పు అతడి తిరిగి ఇవ్వలేదు.

ఆ తర్వాత విషయం భర్త చందుకు తెలిసింది. గతంలో ఇచ్చిన రెండు లక్షలే ఇంకా ఇవ్వలేదని.. మళ్లీ డబ్బులు ఎందుకు ఇచ్చావని చందు లావణ్యపై ఆగ్రహం వ్యక్తం చేశాడు. డబ్బు ఇవ్వాలని శివరామ్ గట్టిగా అడగ్గా.. అతడు దాటవేస్తూ వస్తున్నాడు. గత నెల 30న డబ్బుల విషయంలో భార్యభర్తల మధ్య తీవ్రస్థాయిలో గొడవ జరిగింది. దీంతో శివరామ్‌కి లావణ్య ఫోన్ చేసి డబ్బులు ఇవ్వాలని కోరింది. నీ వల్లే తన భర్తతో గొడవలు జరుగుతున్నాయని చెప్పింది. అనంతరం జనవరి 31న ఇంట్లోని తన గదికి వెళ్లి ఫ్యాన్‌కు ఉరేసుకుంది. కొద్ది నిమిషాల్లోనే ఇంటికి వచ్చిన భర్త ఫ్యాన్‌కు వేలాడుతున్న ఆమెను చూసి షాకయ్యాడు. ఆమెను వెంటనే సమీపంలోని ఓ ప్రైవేటు హాస్పిటల్‌కు తరలించారు. చికిత్స పొందుతూ శనివారం ఆమె మృతి చెందింది. తన భార్య లావణ్య చావుకు శివారమే కారణమని చందు ఫిర్యాదు చేయగా.. కేసు నమోదు చేసుకున్న పోలీసులు విచారణ చేపట్టారు.

## స్థానిక సంస్థల ఎన్నికల నేపథ్యంలో కీలక రిక్వెస్ట్..!





తెలంగాణలో కాంగ్రెస్ పార్టీని మరింత టిష్టపరిచేందుకు పీసీసీ ప్లాన్ చేస్తోంది. స్థానిక సంస్థల ఎన్నికల్లో సత్తా చాటాలని భావిస్తోంది. అందులో భాగంగా వ్యూహాత్మకంగా అడుగులు వేస్తోంది. తాజాగా.. కాంగ్రెస్ సీనియర్ నేత, మాజీ మంత్రి జానారెడ్డికి పీసీసీ అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్ ఫోన్ చేశారు. తరచూ గాంధీ భవన్‌కు వచ్చి నేతలు, కార్యకర్తలకు దిశానిర్దేశం చేయాలని సూచించారు.

తెలంగాణలో మరికొన్ని రోజుల్లో స్థానిక సంస్థల ఎన్నికలు జరగనున్నాయి. ఈ మేరకు బీసీ రిజర్వేషన్ల ఖరారు కోసం రాష్ట్ర ప్రభుత్వం కుల గణన సర్వే నిర్వహించగా.. అందుకు సంబంధించిన నివేదికను నేడు మధ్యాహ్నం 2 గంటలకు రాష్ట్ర ప్లానింగ్ డిపార్ట్మెంట్ కేబినెట్ సబ్ కమిటీకి అందజేయనుంది. నివేదికపై కేబినెట్ సబ్‌కమిటీ చర్చించి ఆమోదించిన తర్వాత ఈ నెల 5న ఉదయం రాష్ట్ర కేబినెట్ సమావేశంలో ఆమోదం తెలపనున్నారు. ఆ తర్వాత ప్రత్యేక అసెంబ్లీ సమావేశం నిర్వహించి చర్చించనున్నారు. ఈనెలాఖరుకు స్థానిక సంస్థల ఎన్నికలు ఉంటాయని ప్రచారం జరుగుతోంది.

ఈ నేపథ్యంలో లోకల్ ఎన్నికల్లోనూ సత్తా చాటాలని కాంగ్రెస్ భావిస్తోంది. ఈ మేరకు వ్యూహాలకు పదును పెడుతోంది. కాంగ్రెస్ ప్రతిష్ఠను పెంచేందుకు వ్యూహాత్మకంగా అడుగులు వేస్తోంది. ఇప్పటికే గాంధీకి రావాలని సీనియర్లకు కబురు పంపింది. తాజాగా.. టీపీసీసీ అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్.. కాంగ్రెస్ సీనియర్ నాయకుడు జానారెడ్డికి ఫోన్ చేశారు. పార్టీ కార్యకర్తలు, నేతలకు దిశానిర్దేశం చేసేందుకు అప్పుడప్పుడు గాంధీభవన్‌కు రావాలని స్పెషల్‌గా రిక్వెస్ట్ చేశారు. గాంధీభవన్‌కు వారానికొకసారైన వచ్చేలా ప్లాన్ చేసుకోవాలని మహేష్ కుమార్ గౌడ్ సూచించినట్లు తెలిసింది.

ఇదిలా ఉండగా.. కాంగ్రెస్ ప్రభుత్వంపై బీఆర్ఎస్, బీజేపీ నేతలపై విమర్శలు కురిపిస్తున్నాయి. ప్రజలతో పాటుగా ఎమ్మెల్యేల్లోనూ అసంతృప్తి ఉందని ప్రచారం చేస్తున్నాయి. రెండ్రోజుల క్రితం ఓ ఎమ్మెల్యే ఫాంహౌస్‌లో 10 మంది కాంగ్రెస్ ఎమ్మెల్యేలు భేటీ అయినట్లు వార్తలు వచ్చాయి. ఈ నేపథ్యంలోనే అలర్ట్ అయిన పీసీసీ.. జానారెడ్డితో సహా సీనియర్లను రంగంలోకి దింపుతోన్నట్లు తెలుస్తోంది. ఇక కాంగ్రెస్ ఎమ్మెల్యేలు రహస్యంగా భేటీ అయ్యారన్న వార్తలపై ఎమ్మెల్యేలు ఒక్కొక్కరుగా స్పందిస్తున్నారు. తాము ఎటువంటి రహస్య భేటీలో పాల్గొనలేదని వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి, ఆలేరు ఎమ్మెల్యే బీర్ల ఐలయ్య తాజాగా స్పష్టం చేశారు. ఉద్దేశపూర్వకంగా ప్రభుత్వంపై కుట్ర జరుగుతోందని రాజేందర్ రెడ్డి ముఖ్యమంత్రి రేవంత్‌కు లేఖ రాశారు. తనపై తప్పుడు ప్రచారం చేసిన వారిపై పరువు నష్టం దావా వేస్తానన్నారు. సీఎంను కలిసి ఈ అంశంపై ఫిర్యాదు చేస్తానని అన్నారు.

# ఎస్ఎస్ సి విద్యార్థులకు "విజయ స్ఫూర్తి" చైతన్య సదస్సు.

## - ఆర్మూర్ ప్రైవేట్ స్కూల్ ఆధ్వర్యంలో ఘనంగా ఏర్పాటు.









**వేగుచుక్క న్యూస్, ఆర్మూర్, ఫిబ్రవరి 2**

ఎస్ఎస్ సి విద్యార్థులకు "విజయ స్ఫూర్తి" చైతన్య సదస్సును ఆదివారం ఆర్మూర్ మండలం పెర్కిట్ గ్రామంలోని కాంతి హైస్కూల్లో ఘనంగా నిర్వహించారు. ప్రైవేట్ స్కూళ్ళలోని పదవ తరగతి చదువుతున్న విద్యార్థులకు ట్రస్మా ఆర్మూర్ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమాన్ని చేపట్టారు. స్టేట్ రిసోర్స్ పర్సన్స్, వివిధ సబ్జెక్ట్ నిపుణలతో విద్యార్థులకు ఏ విధంగా పరీక్షలు వ్రాయాలి, మార్కులు సాధించడానికి తీసుకోవాల్సిన జాగ్రత్తలపై శిక్షణ ఇచ్చారు. అలాగే సబ్జెక్ట్ ఎక్స్పర్ట్స్ తో ప్రైవేట్ స్కూల్ ఉపాధ్యాయులకు బోధన విషయంలో వారికి మెలుకువలు, కొత్త పంతాలో టీచింగ్ ఎలా చేయాలో అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో ట్రస్మ తెలంగాణ స్టేట్ ప్రెసిడెంట్ మధుసూదన్, సెక్రెటరీ రమేష్, ట్రెజరర్ రాఘవేంద్ర లు విజయ స్ఫూర్తి కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. వారిని ట్రస్మా ఆర్మూర్ ప్రెసిడెంట్ మల్లయ్య, ప్రవీణ్ పవార్, వేణు, శ్రీభాషిత సుందర్, కాంతి గంగ రెడ్డి, మానస గణేష్, నలంద ప్రసాద్, నలంద సాగర్, లిల్లీపుట్ రామకృష్ణ , విద్య స్కూల్ గోపి, జెంటిల్ కిడ్స్ ప్రకాష్, బాల్కొండ శాంభవి మధుసూదన్ రాజు, కలిగోట్ సిద్ధార్థ గంగరెడ్డి, వివిధ మండలాల్లోని స్కూల్స్ కరస్పాండెంట్స్ ఆధ్వర్యంలో ముఖ్య అతిథులను సన్మానించారు. ఈ కార్యక్రమం ఉద్దేశించి ట్రస్మా స్టేట్ ప్రెసిడెంట్ మధుసూదన్ మాట్లాడుతూ, ట్రస్మా ఆర్మూర్ ప్రైవేట్ స్కూల్ పదవతరగతి విద్యార్థులకు ఇలాంటి విజయ స్ఫూర్తి తరగతులు నిర్వహించడం గొప్ప విషయం అన్నారు. ఉపాధ్యాయులకు టీచింగ్ విషయంలో కొత్త పంథాలో విద్య ను బోధించడానికి ఇలాంటి తరగతులు ఎంతో ఉపయోగపడతాయని అని అన్నారు. ఇంత మంచి కార్యక్రమం నిర్వహించిన ట్రస్మ ఆర్మూర్ కరస్పాండెంట్లను అభినందించారు. ఈ సమావేశంలో ట్రస్మ తాత్కాలిక కమిటీని ఎన్నుకున్నారు. ఈ కమిటీలో ఆర్మిడ్ క్రాంతి, నలంద ప్రసాద్, లిల్లీపుట్ రామకృష్ణ, సిద్ధార్థ గంగారెడ్డి ఎన్నుకోవడం జరిగింది. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు, వివిధ పాఠశాలల కరస్పాండెంట్లు పాల్గొన్నారు.

### ఘనంగా గన్నారం జడ్పీహెచ్ఎస్‌లో

## వార్షికోత్సవ సంబరాలు.

**వేగుచుక్క న్యూస్, ఇందల్వాయి, ఫిబ్రవరి 2:**




మండలంలోని గన్నారం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల లో వార్షికోత్సవ సంబరాలు అంబరాన్నంటాయి. సుందరమైన అలంకరణతో, ఆధునిక హంగులతో సభా ప్రాంగణం ముస్తాబును చేశారు. పాఠశాలకు విద్యార్థుల తల్లిదండ్రులను, గ్రామస్తులను, సబికులను ఆహ్వానించి అత్యద్భుతమైన స్టేజ్ ఏర్పాటుతో కార్యక్రమాలను చేపట్టారు. శనివారం రాత్రి పాఠశాల ప్రాంగణంలో పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు ఎస్. గాయత్రి జ్యోతి ప్రజ్వలన చేసి, వార్షికోత్సవ సంబరాలను ప్రారంభించారు. తర్వాత పాఠశాల నివేదికను సీనియర్ ఉపాధ్యాయులు రామకృష్ణ సభకు నివేదించారు. అనంతరం విద్యార్థిని, విద్యార్థులు సాంస్కృతిక కార్యక్రమాలతో ఆటపాటలతో అలరించారు. ఈ కార్యక్రమంలో పాటలు, స్కిట్లు, ఏకపాత్రాభినయాలు , మోనో యాక్షన్లు కరాటే, శాస్త్రీయ నృత్యాలు, డాన్స్ లతో సబికులను ఆకట్టుకున్నారు. పాఠశాల ఉపాధ్యాయులైన టీవీఎసన్. మూర్తి, భార్గవ్ తమ వ్యాఖ్యానంతో కార్యక్రమానికి మరింత వన్నె తెచ్చారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయురాలు ఎస్. గాయత్రి, ఉపాధ్యాయ బృందం, గన్నారం గ్రామ అభివృద్ధి కమిటీ, గ్రామ ప్రముఖులు , పాఠశాల హ్యాబిటేషన్ లోని విద్యార్థుల తల్లిదండ్రులు, యువజన సంఘాలు పాల్గొన్నాయి.

# ఆదర్శ కమ్యూనిస్టు కర్నాటి యాదగిరి.

## - సీపీఐ (ఎంఎల్) ప్రజాపంథా శ్రేణుల ఘన నివాళి.






**వేగుచుక్క న్యూస్, నిజామాబాద్, ఫిబ్రవరి 2:**

సీపీఐ(ఎం.ఎల్) ప్రజాపందా ఉమ్మడి జిల్లా కార్యదర్శిగా సుదీర్ఘకాలం పనిచేసిన కర్నాటి యాదగిరి అంతిమ యాత్ర ఆదివారం నిర్వహించారు. ముందుగా పార్టీ కార్యాలయం ఎన్ఆర్ భవన్ కోటగల్లి వద్ద పార్టీ శ్రేణులు, వివిధ పార్టీ, ప్రజా సంఘాల నాయకులు నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమానికి పార్టీ జిల్లా కార్యదర్శి వనమాల కృష్ణ అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా మాస్ లైన్ (ప్రజాపంథా) రాష్ట్ర సెక్రటేరియట్ సభ్యులు కేజీ రామచంద్రరావు, కే.రమ హాజరై మాట్లాడారు. మాస్ లైన్ (ప్రజాపంథా) సీనియర్ నాయకుడు, 40 సంవత్సరాల పాటు రాష్ట్ర కమిటీ సభ్యులుగా, నిజామాబాద్ జిల్లా కార్యదర్శిగా పనిచేసిన కర్నాటి యాదగిరి మరణించడం పార్టీకే కాకుండా, పీడిత ప్రజలకు తీరని లోటన్నారు. అత్యంత త్యాగపూరిత జీవిత%శీ% ఆయనదన్నారు. 1969 లొ సాంఘిక సంక్షేమ శాఖ లో ఎల్ డిసిగా ఉద్యోగం చేస్తూ, డీవీ కృష్ణ , దాసు ల స్ఫూర్తితో ఉద్యోగానికి రాజీనామా చేసి, పార్టీ బాధ్యతలను స్వీకరంచారన్నారు. అనేక నిర్బంధాలను, ఎమర్జెన్సీ కాలంలో రహస్య జీవితాన్ని ఎదుర్కొన్నారన్నారు. యాదగిరి గారి కళ్ళను లయన్స్ క్లబ్ కు, శరీరాన్ని వైద్య విద్యార్థుల పరిశోధనల కోసం, నిజామాబాద్ ప్రభుత్వ మెడికల్ కాలేజీకి అప్పగించడం అత్యంత ఆదర్శనీయమన్నారు. అనంతరం యాదగిరి భౌతిక కాయాన్ని ప్రభుత్వ మెడికల్ కాలేజీ వరకు అంతిమయాత్ర నిర్వహించారు. వైద్య విద్యార్థుల పరిశోధన కోసం ప్రభుత్వ మెడికల్ కాలేజీకి అప్పగించారు. ఈ కార్యక్రమంలో మాజీ మంత్రి మండవ వెంకటేశ్వరరావు,

మాస్ లైన్ రాష్ట్ర సెక్రటేరియట్ సభ్యులు కే.సూర్యం, వి.ప్రభాకర్, ఎం.హన్మేశ్, న్యూడెమోక్రసీ రాష్ట్ర సెక్రటేరియట్ సభ్యులు వేములపల్లి వెంకట్రామయ్య, జిల్లా కార్యదర్శి ఆకుల పాపయ్య సీపీఎం జిల్లా కార్యదర్శి రమేష్ బాబు, సీపీఐ రాష్ట్ర నాయకులు కంజర భూమయ్య, ప్రొ. లింబాద్రి, డాక్టర్ లక్ష్మారెడ్డి, డాక్టర్ సూరి, నర్రా రామారావు, కోటపాటి నరసింహ నాయుడు, వేణుగోపాల్, కాకతీయ రజనీకాంత్, ఏఎస్ పోశెట్టి, భక్తవత్సలం, యాదగిరి కుటుంబ సభ్యులు సుధారాణి, సంధ్యారాణి, భాస్కరస్వామి, శివరాజు, రవీందర్, రాధ మరియు వివిధ పార్టీ, ప్రజా సంఘాల నాయకులు పాల్గొన్నారు.

### నేషనల్ గేమ్స్ లో సెమిస్ కు క్వాలిఫై అయినా బాస్కెట్ బాల్ జట్లు.



**వేగుచుక్క న్యూస్, నిజామాబాద్, ఫిబ్రవరి 2:**

ఉత్తరఖాండ్ లో జరుగుతున్నా నేషనల్ గేమ్స్ లో తెలంగాణ పురుషుల, మహిళల జట్లు సెమిస్ కు అర్హత సాధించినట్లు ఈగ సంజీవ్ రెడ్డి ఒక్క ప్రకటన లో తెలిపారు. పురుషుల జట్టు రాజస్థాన్ పై 21-19 స్కోర్ తో విజయం సాధించి సెమీ ఫైనల్ కు దూసుకెళ్ళింది. అలాగే ఉత్తరఖాండ్ 22-8 స్కోర్ తో విజయం సాధించి సెమీ ఫైనల్ చేరుకున్నాయని తెలిపారు. రాష్ట్ర జట్లు బాస్కెట్ బాల్ లో సెమీ ఫైనల్ చేరడం పట్ల రాష్ట్ర ఒలింపిక్ అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు జితేందర్ రెడ్డి, మల్లారెడ్డి, ఉపాధ్యక్షులు ఈగ సంజీవ్ రెడ్డి, సంఘ సభ్యులు హర్షం వ్యక్తం చేశారు.

## అయోధ్య సమీపంలో దళిత యువతి హత్యాచారంపై ఎంపీ కన్నీరు

దళిత యువతిని దారుణంగా అత్యాచారం చేసి.. హత్య చేసిన ఘటనపై ఉత్తర్‌ప్రదేశ్ ఎంపీ తీవ్ర భావోద్వేగానికి గురయ్యారు. దళిత యువతిపై హత్యాచారం ఘటన నేపథ్యంలో సీతారాములు ఎక్కడ ఉన్నారని.. మీరు ఎక్కడ ఉన్నారంటూ మీడియా సమావేశంలోనే కన్నీరు మున్నీరుగా విలపించారు. ఇక ఈ ఘటనలో దళిత యువతి కుటుంబానికి న్యాయం జరగకపోతే.. తాను ఎంపీ పదవికి రాజీనామా చేస్తారని తెలిపారుఉత్తర్‌ప్రదేశ్‌లోని ఫైజాబాద్ నుంచి సమాజ్‌వాదీ పార్టీ తరఫున ఎంపీగా ఎన్నికైన అవధేష్ ప్రసాద్ మీడియా సమావేశంలోనే కన్నీరు పెట్టుకున్నారు. 22 ఏళ్ల దళిత యువతిపై గుర్తు తెలియని వ్యక్తులు అత్యాచారం చేసి.. దారుణంగా చంపిన ఘటనపై ఆయన తీవ్ర భావోద్వేగం అయ్యారు.

# కేంద్ర బడ్జెట్ పై కాంగ్రెస్ నాయకులు మతిలేని మాటలు.

**అర్బన్ ఎమ్మెల్యే దన్ పాల్ సూర్య నారాయణ.**

**వేగుచుక్క న్యూస్, నిజామాబాద్, ఫిబ్రవరి 2:**




కేంద్ర బడ్జెట్ పై కాంగ్రెస్ నాయకులు మతిలేని మాటలు మాట్లాడుతున్నారని అర్బన్ ఎమ్మెల్యే దన్ పాల్ సూర్య నారాయణ అన్నారు. ఆదివారం బీజేపీ జిల్లా కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఎమ్మెల్యే మాట్లాడారు. 2047 నాటికీ వికసిత్ భారత్ కల సాకారానికి ముందడుగే ఈ బడ్జెట్ అన్నారు. సబ్ కా సాత్ సబ్ కా వికాస్ లక్ష్యంతో కేంద్ర ప్రభుత్వం పేదరిక నిర్మూలన కోసం, పేద, మధ్యతరగతి వర్గాల ప్రజల సంక్షేమమే ధ్యేయంగా, అన్ని రాష్ట్రాల మౌలిక సదుపాయాల కల్పనలో భాగంగా బడ్జెట్ ను రూపొందించడం జరిగిందన్నారు.

మధ్యతరగతి ఉద్యోగులకు ఊరట : కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్ లో మధ్యతరగతి ఉద్యోగులకు వ్యక్తిగత పన్ను చెల్లింపులో 12.75 లక్షల వరకు మినహాయింపు ఇవ్వడం హర్షించదగ్గ విషయం.

**పరిశ్రమల అభివృద్ధి :**

సూక్ష్మ, చిన్న తరహా, పరిశ్రమల ధ్వారా మహిళ సాధికారాతకు ప్రస్తుతంకోటికి పైగా ఎంఎస్ఎంఈ ల ద్వారా 7.5 కోట్ల మందికి పైగ ఉపాధి పొందుతున్నారు, వచ్చే ఐదు ఏళ్లలో 1.5 లక్షల కోట్లకు పైగ రుణ సహాయం అందనుంది.సూక్ష్మ, చిన్న తరహా పరిశ్రమల పరిమితి ఐదు కోట్ల నుండి పది కోట్లకు పెంచడం జరిగిందన్నారు. స్టార్టప్ లకు పది కోట్ల నుండి ఇరవై కోట్లకు పరిమితి పెంచడం జరిగిందన్నారు.

**రైతుల సంక్షేమం**

కేంద్ర ప్రభుత్వం కిసాన్ క్రెడిట్ కార్డుల ధ్వారా తక్కువ వడ్డీకె ఇచ్చే రుణ సదుపాయం 3 లక్షల నుండి 5 లక్షల వరకు పెంచడం జరిగిందని దీని ధ్వారా 7.7 కోట్ల రైతులకు లబ్ధి చేకూరానున్నట్లు తెలిపారు.పత్తి ఉత్పత్తిని పెంచడానికి ప్రత్యేక మిషన్ ఏర్పాటుతో పాటు చిరు ధాన్యల స్వయం సమృద్ధికి ప్రత్యేక చర్యలు తీసుకోనున్నట్లు తెలిపారు.

**విద్య,వైద్యం పై ఫోకస్**

ప్రభుత్వ పాఠశాలలో 50 వేల అటల్ లాబ్స్ ఏర్పాటు చేయడంతో పాటు విద్య రుణాలు తీసుకున్న వారికీ 10 లక్షల వరకు టిసిఎస్ (టాక్స్ కలెక్షన్ ఎట్ సోర్స్) ను తొలగించిం దన్నారు.వైద్య రంగంలో రాబోయే 5 ఏళ్లలో 75 వేల మెడికల్ సీట్ల అందుబాటులో తీసుకొస్తాం అన్నారు, దేశవ్యాప్తంగా ప్రతి జిల్లాలో క్యాన్సర్ చికిత్సకు డేకేర్ కేంద్రాలను ఏర్పాటుకు కేంద్రం పునుకుందన్నారు.

**చేతివృత్తుల రంగాలకు చేయూత**



చర్యలు బొమ్మల తయారీ రంగాన్ని ప్రోత్సాహిస్తూ నైపుణ్యం కలిగిన బొమ్మల తయారీ పెంపోందిస్తూ ప్రపంచంలో అతిపెద్ద బొమ్మల తయారీ దేశాంగా తయారు చేసే లక్ష్యం దిశగా అడుగులు వేస్తుందన్నారు, చెప్పుల తయారీకి సంబంధించి యంత్రాలు, తోళ్ల రహిత చెప్పుల తయారీకి చర్యలు తీసుకోవడం ధ్వారా 22 లక్షల మంది ఉపాధి పొందే అవకాశం ఉందన్నారు. దేశ వ్యాప్తంగా ఉన్న ఒక కోటి గిగ్ వర్కర్లకు ఆరోగ్య భీమా వర్తించేల పథకం తీసుకురావడం జరిగిందన్నారు, అన్ని రాష్ట్రాల మౌలిక సదుపాయాలకు లక్షన్నర కోట్లు వడ్డీ రహిత రుణాలు అందించనున్నాం అన్నారు.కాంగ్రెస్ నాయకులు కేంద్రాన్ని విమర్శించడమే లక్ష్యంగా పెట్టుకొని వారు మతిలేని మాటలు మాట్లాడుతున్నారని అన్నారు. కేంద్రం ప్రవేశ పెట్టిన బడ్జెట్ సామాన్య ప్రజల గుండెల్లో నిలిచిపోయేల ఉందన్నారు. అది జిర్ణించుకోలేని కాంగ్రెస్ నాయకులు విషం చీమ్ముతున్నారని అన్నారు.

కాంగ్రెస్ ప్రభుత్వం తెలంగాణ రాష్ట్రాన్ని అప్పుల కుప్ప చేసి కమీషన్లకు ఎగపడి దోచుకుంటున్నారని మండిపడ్డారు, కేంద్ర ప్రభుత్వం తెలంగాణ అభివృద్ధికి నిధులు ఇస్తది కాని దోచుకోవడానికి, దాచుకోవడానికి నిధులు ఇవ్వదు అని ఏద్దేవా చేసారు. ఈ కార్యక్రమంలో బిజెపి జిల్లా ఉపాధ్యక్షులు నాగోళ్ళ లక్ష్మీనారాయణ, మండల అధ్యక్షులు నాగరాజు, బీజేపీ నాయకులు మల్లేష్ గుప్తా, నాయకులు ఆనంద్, పవన్ పాల్గొన్నారు.